




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక :105 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం శుక్రవారం 20 డిసెంబర్ 2024 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :105 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM FRI 20 DECEMBER 2024 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Ongole Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోంది

- పోరాటాలకు సమయం ఆసన్నమయింది... నాయకులుగా ఎదగడానికి మీకు ఇదొక అవకాశం: జగన్
- ఉమ్మడి అనంతపురం జిల్లా నేతలతో జగన్ సమావేశం
- చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్న జగన్
- చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించారని వ్యాఖ్య
- చంద్రముఖిని లేపడమంటే పులి నోట్లో తల పెట్టడమేనని ఆరోజు చెప్పానన్న జగన్




పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ అధినేత జగన్ మరోసారి విరుచుకుపడ్డారు. ఆరు నెలలు కూడా తిరగకముందే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని... ఇంతటి వ్యతిరేకత గతంలో ఏ ప్రభుత్వంపై రాలేదని ఆయన అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా స్థానిక సంస్థల ప్రతినిధులు, పార్టీ నేతలతో ఈరోజు జగన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వంపై మనమంతా పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమయిందని జగన్ అన్నారు. ప్రభుత్వ వ్యతిరేకత వైసీపీకి అనుకూలంగా మారాలంటే ప్రజా సమస్యలపై కలిసికట్టుగా పోరాటం చేయాలని చెప్పారు. ప్రజల తరపున మనం గొంతు విప్పాలని పిలుపునిచ్చారు. నాయకులుగా ఎదగడానికి మీకు ఇదొక అవకాశం అని చెప్పారు.మన ప్రభుత్వ హయాంలో ప్రతి కుటుంబానికి మనం ఎంతో చేశామని జగన్ చెప్పారు. అంతకంటే ఎక్కువ చేస్తానని చెప్పి ప్రతి ఇంట్లో ప్రతి ఒక్కరికీ



వివరాలు 2లో..

## అంబేద్కర్ కు ఎవరి ద్వారా గుర్తింపు వచ్చిందనే అంశంపై చర్చ జరగాలి

- అంబేద్కర్ పై అమిత్ షా వ్యాఖ్యలు!
- పార్లమెంటులో రణరంగం
- కాంగ్రెస్ హయాంలో అంబేద్కర్ కు తగిన గుర్తింపు లభించలేదన్న చంద్రబాబు
- అంబేద్కర్ ఓడిపోయింది కూడా కాంగ్రెస్ హయాంలోనే అని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఢిల్లీలో చోటు చేసుకున్న పరిణామాలపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రివర్గ సహచరులకు పలు సూచనలు చేశారు. సున్నితమైన అంశాలపై జాగ్రత్తగా మాట్లాడాలని స్పష్టం

వివరాలు 2లో..

## అమెరికాలో బర్డ్ ఫ్లూ కలకలం..

కాలిఫోర్నియాలో ఎమర్జెన్సీ




పెన్ పవర్ డెస్క్:అమెరికాలోని కాలిఫోర్నియాలో బర్డ్ ఫ్లూ (హెచ్5ఎన్1) కలకలం రేపుతోంది. 34 మంది ఈ వైరస్ బారిన పడడంతో రాష్ట్రంలో ఎమర్జెన్సీ విధిస్తూ గవర్నర్ గవిన్ న్యూసమ్ ఆదేశాలు జారీ చేశారు. వైరస్ వ్యాప్తిని అరికట్టే చర్యలు తీసుకుంటున్నట్టు గవర్నర్ తెలిపారు. దక్షిణ కాలిఫోర్నియాలోని ఓ డెయిరీ ఫాంలోని ఆవుల్లో ఈ వైరస్‌ను గుర్తించారు. వైరస్ ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి సంక్రమించిన ఆధారాలు లభించలేదని గవర్నర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఈ వైరస్ బారినపడిన వారందరూ ఆ డెయిరీ ఫాంలో పనిచేసినవారు, అక్కడికి దగ్గర్లో ఉన్నవారేనని వివరించారు. ఈ వైరస్ వల్ల సాధారణ ప్రజలకు ఎలాంటి ముప్పు లేదని అమెరికా సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ తెలిపింది.

## అంబేద్కర్ రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని తెచ్చేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోంది

- అమిత్ షా వ్యాఖ్యలపై తీవ్రంగా మండిపడ్డ ఏపీ పీసీసీ చీఫ్
- అంబేద్కర్ ను అవమానించడం బీజేపీ అహంకారానికి నిదర్శనమని వ్యాఖ్యలు
- దళిత, గిరిజన వర్గాల మనోభావాలను దెబ్బతీశారంటూ ఫైర్



పెన్ పవర్ డెస్క్:దళితులు, గిరిజనులు, బీసీలు, మైనారిటీలు దైవంగా పూజించే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను బీజేపీ అవమానించిందంటూ ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల మండి పడ్డారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు ఆ పార్టీ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు.

వివరాలు 2లో..

## సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు రూ. 2.10 కోట్లు అక్రమంగా చెల్లించారు

- ఏపీ ఫైబర్ నెట్ దివాళా అంచున ఉందన్న జీవీ రెడ్డి
- 'వ్యూహం' సినిమాను ఫైబర్ నెట్ లో టెలికాస్ట్ చేసి రూ. 2.10 కోట్లు ఇచ్చారని ఆరోపణ
- అవినీతిపై విజిలెన్స్ విచారణ జరుగుతోందని వెల్లడి



పెన్ పవర్ డెస్క్: ఏపీ ఫైబర్ నెట్ ప్రస్తుతం దివాళా అంచున ఉందని ఆ సంస్థ ఛైర్మన్ జీవీ రెడ్డి తెలిపారు. సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు అప్పటి అధికారులు రూ. 2.10 కోట్లను అక్రమంగా చెల్లించారని చెప్పారు. 'వ్యూహం' సినిమాను ఫైబర్ నెట్ లో టెలికాస్ట్ చేసి... వర్మకు అక్రమ చెల్లింపులు చేశారని తెలిపారు. ఆ చిత్రానికి 18 లక్షల వ్యూస్ వచ్చినందుకు రూ. 2 లక్షలు చెల్లించాల్సి ఉండగా... రూ. 2.10 కోట్లు ఇచ్చారని దుయ్యబట్టారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఫైబర్ నెట్ సంస్థలో జరిగిన అవినీతిపై విజిలెన్స్ విచారణ

వివరాలు 2లో..

## మేం జగనన్న సైనికులం.. ఎవరికీ భయపడం




- భయమనేది జగన్ బ్లడ్ లోనే లేదన్న మాజీ మంత్రి
- ఈవీఎంలను మానిపులేట్ చేసి అధికారంలోకి వచ్చారని ఆరోపణ
- ప్రభుత్వం నీతిమాలిన రాజకీయాలు చేస్తోందని మండిపాటు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ఆరు నెలల్లో ప్రజలకు చేసిన మంచి ఏమీలేదని మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా విమర్శించారు. ప్రజలకు మంచి చేయాల్సిన నేతలు వైసీపీ లీడర్లపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని మండిపడ్డారు. ఈ ఆరు నెలల కాలంలో వైసీపీ నేతల

వివరాలు 2లో..

## మంత్రి నిమ్మల రామానాయుడుకి హరిరామ జోగయ్య లేఖ

- పాలకొల్లులో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించాలన్న జోగయ్య
- రాజ్య భవనాలు, పాలన భవనాల నిర్మాణం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని విమర్శ
- ప్రభుత్వ ప్రాధాన్యతలు వేరుగా ఉన్నాయని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:పాలకొల్లు నియోజకవర్గంలో 500 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాలని కోరుతూ మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ శ్రీనివాస్ వర్మకు మాజీ మంత్రి, కాపు నేత హరిరామ జోగయ్య లేఖ రాశారు. అభివృద్ధి అంటే పరిపాలన భవనాలు, నివాస భవనాలు, పార్కులు, విశ్రాంతి భవనాలు నిర్మించడానికి ప్రాధాన్యత ఇవ్వడం కాదని... స్వచ్ఛమైన తాగునీరు, విద్య, వైద్యం, ఆరోగ్యం, రోడ్ల నిర్మాణం, సాగు నీరు, మురుగు కాలువల నిర్మాణం కూడా అతి ముఖ్యమైనవని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ ప్రాధాన్యతలు వేరుగా ఉన్నాయని విమర్శించారు. రాజ్య భవనాలు, నివాస, పరిపాలన భవనాల

వివరాలు 2లో..

## అంబటి రాంబాబుపై కేసు నమోదు

- తమ ఫిర్యాదులపై కేసులు నమోదు చేయాలంటూ అంబటి నిరసన
- తమ విధులకు ఆటంకం కలిగించారంటూ కేసు నమోదు
- అంబటితో పాటు పలువురిపై కేసు



పెన్ పవర్ డెస్క్:వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసు నమోదయింది. గుంటూరు పట్టణ పరిధిలోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ లో అంబటితో పాటు పలువురు వైసీపీ నేతలపై కేసు నమోదు చేశారు. తాము చేసిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టాభిపురం పీఎస్ వద్ద అంబటి, ఇతర నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ క్రమంలో తమ విధులకు ఆటంకం కలిగించారంటూ పోలీసులు కేసు నమోదు చేశారు.

## కుల్గాంలో భారీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు ఉగ్రవాదుల హతం

- కుల్గాంలోని ఓ ఇంటిలో ఉగ్రవాదులు దాక్కున్నట్టు సమాచారం
- సంయుక్త ఆపరేషన్ నిర్వహించిన జమ్మూకశ్మీర్ పోలీసులు, భద్రతా బలగాలు
- ఈ ఏడాది జరిగిన రెండో అతి పెద్ద ఎన్‌కౌంటర్ ఇదే



పెన్ పవర్ డెస్క్:జమ్మూకశ్మీర్‌లోని కుల్గాంలో ఈ ఉదయం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో ఐదుగురు ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టాయి. ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. ఉగ్రవాదుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్న అనంతరం వారిని గుర్తిస్తామని ఆర్మీ అధికారులు తెలిపారు. దక్షిణ కశ్మీర్‌లోని కుల్గాంలోని ఓ ఇంట్లో నలుగురైదుగురు ఉగ్రవాదులు తలదాచుకున్నట్టు సమాచారం

వివరాలు 2లో..

## క్యాబినెట్ సమావేశంలో 21 అంశాలపై చర్చించాం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- మీడియాకు వివరాలు వెల్లడించిన మంత్రి కొలుసు పార్థసారథి
- 475 జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకానికి ఆమోదం
- వరద ప్రభావిత ప్రాంతాల్లో రుణాల రీషెడ్యూల్ కు నిర్ణయం
- అమరావతి నిర్మాణ ప్రతిపాదనలకు ఆమోదం




పెన్ పవర్ డెస్క్:సీఎం చంద్రబాబు అధ్యక్షతన నేడు ఏపీ క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశం వివరాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు. నేటి మంత్రివర్గ సమావేశంలో 21 అంశాలపై చర్చ జరిగిందని తెలిపారు. గతంలో చేపట్టకుండా నిలిపివేసిన పనులను పునఃపరిశీలిస్తామని చెప్పారు. పరిశీలన తర్వాత ఆయా ప్రాజెక్టులు తిరిగి చేపట్టేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. ముఖ్యంగా, అమరావతి నిర్మాణం కోసం ప్రతిపాదనలకు నేటి మంత్రివర్గం పచ్చజెండా ఊపిందని తెలిపారు. మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి చేసేందుకు నిర్ణయించినట్టు వెల్లడించారు. 45 పనులకు రూ.33 వేల కోట్ల నిధులు ఖర్చు చేసేందుకు సీఆర్డీఏకు అనుమతి ఇవ్వడం జరిగిందని చెప్పారు.

వివరాలు 2లో..

## బీజేపీ ఎంపీలు నన్ను నెట్టేశారు... నాకు గాయమైంది

- అంబేద్కర్ పై అమిత్ షా వ్యాఖ్యలు
- పార్లమెంటు ప్రాంగణంలో తోపులాట
- తన మోకాళ్లకు గాయమైందన్న ఖర్గే
- విచారణ జరిపించాలని లోక్ సభ స్పీకర్ కు లేఖ

పెన్ పవర్ డెస్క్:అంబేద్కర్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు విపక్షాలను ఆగ్రహావేశాలకు గురిచేశాయి. ఈ నేపథ్యంలో, నేడు పార్లమెంటు ప్రాంగణం రణరంగాన్ని తలపించింది. ఎన్డీయే, ఇండియా కూటమి పక్షాల ఎంపీల మధ్య తోపులాట జరగ్గా... బీజేపీ ఎంపీలు ప్రతాప్ చంద్ర సారంగి, ముఖేశ్ రాజ్ పుత్ గాయపడ్డారు. వీరిలో ప్రతాప్ చంద్ర సారంగికి తలకు లోతైన గాయం కావడంతో వైద్యులు కుట్లు వేశారు. ఈ ఇద్దరు ఎంపీలకు ఢిల్లీలోని రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రిలో ఐసీయూలో చికిత్స అందించారు. ఈ క్రమంలో, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. మకర్ ద్వార్ ఎంట్రన్స్ దగ్గర జరిగిన ఘర్షణ సందర్భంగా బీజేపీ ఎంపీలు తనను నెట్టివేశారని,దాంతో తాను అదుపుతప్పి

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# కరిగిపోతున్న అంబానీ, ఆదానీల ఆదాయం...

భారత కుబేరుల సంపద సన్నగిల్లుతోంది. అంబానీ, అదానీల నికర సంపదలో డౌన్‌ఫాల్ మొదలయ్యింది. కొంతకాలంగా భారత స్టాక్ మార్కెట్ సూచీలు పతనం అవుతుండగా? దిగ్గజ కంపెనీలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ గ్రూప్ స్టాక్స్ పెద్ద మొత్తంలో పడిపోతున్నాయి. ఈ క్రమంలో దిగ్గజ పారిశ్రామిక వేత్తల నికర సంపద భారీగా తగ్గుతోంది. భారతదేశంలో అత్యంత సంపన్నుల జాబితాలో అగ్ర స్థానంలో నిలవడమే గాక, ఆసియాలోనే ధనికులుగా గుర్తింపు పొందినవారు రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ, అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ. కొద్ది నెలల క్రితం నికర ఆదాయం భారీగా పెరిగిన వీరు, ఇప్పుడు మాత్రం బ్లూమ్ బర్గ్ 100 బిలియన్ డాలర్ల క్లబ్ లో చోటు దక్కించుకోలేకపోయారు. వారి వ్యాపారాలతోపాటు వ్యక్తిగత సంపద విషయంలోనూ ఇద్దరూ సవాళ్లు ఎదుర్కోవడం వల్లే ఈ క్లబ్ నుంచి బయటకు రావాల్సి వచ్చిందని తాజాగా విడుదలైన 'బ్లూమ్‌బర్గ్' నివేదిక పేర్కొంది.అంబానీ ఎనర్జీ, రిటైల్ వ్యాపారాల ప్రదర్శన అనుకున్నంతగా లేకపోవడం కూడా ఈ క్లబ్ నుంచి బయటకు రావడానికి ఒక కారణమని బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. ఇప్పుడు, ప్రపంచ కుబేరుల జాబితాలో టాప్-10లో ఇద్దరిలో ఏ ఒక్కరూ లేకపోవడం గమనార్హం. సెప్టెంబరు 2022లో గౌతమ్ అదానీ.. ప్రపంచంలోనే రెండవ అత్యంత సంపన్న వ్యక్తిగా ఉండగా.. ఇప్పుడు 19వ స్థానానికి పడిపోయారు. ముఖేష్ అంబానీ 17వ స్థానానికి పరిమితమయ్యారు. తాజాగా.. ఇద్దరి సంపద 100 బిలియన్ డాలర్ల మార్క్ దిగువకు చేరినట్లు బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ నివేదిక వెల్లడించింది.జులైలో, తన కుమారుడు అనంత్ అంబానీ పెళ్లి సమయంలో అంబానీ సంపద దాదాపు 120.8 బిలియన్ డాలర్లకు చేరుకుంది. భారత కరెన్సీలో ఇది రూ. 10.25 లక్షల కోట్లు. అదే సమయంలో అంబానీ కుమారుడు వివాహానికి దాదాపుగా 600 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారు. అంబానీ ఇటీవల డిజిటల్ ప్లాట్‌ఫాంలు, రిటైల్ బ్రాండ్లపై దృష్టి సారించారు. రిటైల్ వ్యాపారంలో ఇటీవల వృద్ధి, లాభాలు మందగించాయి. ఇక, కేసులతో కొత్త చిక్కులు ఎదుర్కుంటున్నఅదానీ కూడా డౌన్‌ఫాల్‌ను ఎదుర్కుంటున్నారు.సౌరశక్తి సరఫరా ఒప్పందాలు పొందడం కోసం భారతీయ అధికారులకు ముడుపులు ఇచ్చిన వ్యవహారంలో అమెరికాలో కేసు నమోదైన తర్వాత అదానీ సంపదలో క్షీణత మొదలైంది. జూన్‌లో అదానీ సంపద 122.3 బిలియన్ డాలర్లకు చేరుకోగా.. అమెరికాలో ఆరోపణలు, కేసులు.. అంతకుముందు హిండెన్‌బర్గ్ నివేదిక నేపథ్యంలో అదానీ సామ్రాజ్యానికి సవాళ్లు ఎదురయ్యాయి. ఫలితంగా అదాని సంపద 100 బిలియన్ డాలర్ల కంటే దిగువకు పడిపోయింది. బ్లూమ్ బర్గ్ నివేదిక ప్రకారం, ప్రస్తుతం ముకేశ్ అంబానీ సంపద 96.3 బిలియన్ డాలర్లు కాగా? గౌతం అదానీ సంపద 80.8 బిలయన్ డాలర్లుగా ఉంది.ఇక, రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థలోని ప్రధాన వ్యాపారాలైన రిటైల్, ఇంధన రంగాలు ఇటీవల మెరుగైన పనితీరు కనబర్చకపోవడమే ముఖేష్ అంబాని పరిస్థితికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. చమురు, రసాయన విభాగంలో డిమాండ్ తగ్గడం, రిటైల్ వినియోగదారుల వ్యయాలు తగ్గడం, చైనా ఎగుమతుల నుంచి పోటీ వంటివి అంబాని సంపదకు ఎసరు పెట్టాయి. ఈ క్రమంలో, కంపెనీకి పెరుగుతున్న అప్పులపైనా ఇన్వెస్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తుండగా.. రిలయన్స్ షేర్లు తగ్గుతూ వచ్చింది. అలాగే, ఇటీవల మీడియా, ఏఐ కంప్యూటింగ్‌లో ఆధిపత్యం కోసం అంబానీ పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టడం కూడా సంపద డౌన్‌ఫాల్‌కు కారణమయ్యింది.మరోవైపు, గౌతమ్ అదానీ సంపద గత కొన్నేళ్లుగా తీవ్ర హెచ్చుతగ్గులకు గురవుతోంది. 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ రిపోర్ట్ వెలువడగా.. గరిష్ట స్థాయిల నుంచి సంపద భారీగా తగ్గింది. మధ్యలో మళ్లీ పుంజుకున్నప్పటికీ.. ఇటీవల వరుస ఆరోపణలు, దర్యాప్తులతో మళ్లీ షేర్లపై ప్రభావం పడినట్లు తెలుస్తోంది. అదానీ గ్రూప్‌పై వచ్చిన ఆరోపణలు వచ్చే ఏడాది కూడా ఆ సంస్థ మార్కెట్ విలువపై ప్రభావం చూపే అవకాశం ఉందని నివేదికలు అంచనా వేస్తున్నాయి. అయితే, గతంలోలాగా మళ్లీ మదుపరుల విశ్వాసం పొందేతే తప్ప ఈ ఇద్దరు కుబేరులు కష్ట కాలం నుండి బయటపడే అవకాశం ఉంది.గౌతం అదానీ, ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద నష్టపోయినప్పటికీ? భారతదేశంలోని టాప్-20 బిలియనీర్ల సంపద 2024 జనవరి నుంచి 67.3 బిలియన్ డాలర్లు వృద్ధి చెందినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదిక వెల్లడించింది. వారిలో ప్రముఖ పారిశ్రామికవేత్త, ఊఅఒ టెక్నాలజీ వ్యవస్థాపకుడు శివ్ నాడార్ 10.8 బిలియన్ డాలర్లు, ఉక్కు పారిశ్రామికవేత్త సావిత్రి జిందాల్ 10.1 బిలియన్ డాలర్ల సంపద పెంచుకున్నారు.మరోవైపు, ఎలన్ మస్క్ కంపెనీ స్టార్ లింక్ భారత్‌లో ఎంట్రీ ఇవ్వడానికి రంగం సిద్ధమైనట్లు కనిపిస్తోంది. దీనితో, స్టార్ లింక్, భారత్‌లో శాటిలైట్ ఆధారిత వాయిస్, డేటా కమ్యూనికేషన్ వంటి సేవలు ప్రారంభిస్తే.. ఎయిర్‌టెల్‌తో పాటు అంబానీ సంస్థ జియో కూడా గట్టి పోటీని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇది, అంబానీ సంపదకు మరో సవాలుగా మారే ఛాన్స్ ఉంది. అంబానీ తిరిగి నిలదొక్కుకోడానికి చేస్తున్న ఈ వ్యూహాలు దీర్ఘకాలిక వృద్ధి సామర్థ్యాన్ని సూచిస్తున్నాయి.తాజా గ్లోబల్, డొమెస్టిక్ సవాళ్లకు కొత్తగా అమెరికా గద్దెనెక్కబోతున్న ట్రంప్ ప్రెసిడెన్సీ కూడా ఒక రకంగా కారణమేనని కొందరు వాదిస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్‌కి తిరిగి ఎన్నికైన తర్వాత భారతీయ ఎగుమతులపై కొత్త ట్యాక్స్‌లను మోపుతున్నారు. దీని వల్ల భారతీయ వ్యాపారాలకు సంభావ్య వాణిజ్య సవాళ్లు ఎదురవుతాయనే భయం కూడా అందరిలో కనిపిస్తోంది. అయితే, దీని ప్రభావం ఇప్పటికే కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక, రాబోయే రోజుల్లో మరిన్ని సవాళ్లు ఎదుర్కోవాల్సి వస్తుందని కూడా నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ట్రంప్ విధించిన సుంకాలతో భారతదేశ ఎగుమతులు పోటీలో నిలదొక్కుకోలేవని అంటున్నారు.ఇన్ని సవాళ్లు ఉన్నప్పటికీ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత ఆర్థిక వ్యవస్థ? దేశంలో అభివృద్ధి చెందుతున్న మధ్యతరగతికి అవకాశాలను అందిస్తూనే ఉండటాన్ని మంచి పరిణామంగా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# మేం జగనన్న సైనికులం.. ఎవరికీ భయపడం

- మొదటి పేజీ తరువాయి

ఇళ్ల ముందు గుమ్మాలు కొట్టడం, పొలాలకు అడ్డంగా గోడలు కట్టడం తప్ప వారు ఇచ్చిన సూపర్ సిక్స్ సహా ఇతర హామీల అమలుపై కనీసం ఆలోచన కూడా చేయడంలేదన్నారు. వాగ్దానాలు నెరవేర్చకుండా ప్రభుత్వం ఎలా మోసం చేస్తోందో ప్రజలకు అర్థమైందని అన్నారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని, తప్పుడు కేసులు బనాయించి భయాందోళనలకు గురిచేసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. అయితే, భయమనేది తమ నాయకుడు జగన్ బ్లడ్ లోనే లేదని, ఆయన వెంట నడిచే సైనికులుగా తాము కూడా ఎవరికీ భయపడబోమని పేర్కొన్నారు. ప్రభుత్వ వేధింపులకు భయపడి ప్రశ్నించడం మానుకోబోమని స్పష్టం చేశారు. నగరి నియోజకవర్గంలోని వైసీపీ నేతలు, కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి కోసం ఎవరితోనైనా ఎంతవరకైనా పోరాడేందుకు సిద్ధమని చెప్పారు.మేం జగనన్న సైనికులం.. అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఎవరమూ ఎలాంటి తప్పుచేయలేదని రోజా చెప్పారు. గతంలో పద్నాలుగేళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రజలకు చేసిందేమీ లేదని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఏమీ చేయలేదని విమర్శించారు. మోసాలకు పాల్పడి, ఈవీఎంలను టాంపరింగ్ చేసి కూటమి అధికారంలోకి వచ్చిందని రోజా ఆరోపించారు. కూటమి ప్రభుత్వ హనీమూన్ కాలం అయిపోయిందని, ఇకపై ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలపై గట్టిగా ప్రశ్నిస్తామని హెచ్చరించారు. నీతిమాలిన రాజకీయాలను వైసీపీ నేతలు అందరమూ కలిసి ఎదుర్కొంటామని చెప్పారు. టీడీపీ నాయకుల ఒత్తిడికో, తప్పుడు ఆదేశాలకో లోబడి చట్టవిరుద్ధంగా వ్యవహరించే అధికారులపై హెరాస్ మెంట్ కేసులు వేసి కోర్టులో నిలబెడతామని రోజా హెచ్చరించారు.

# క్యాబినెట్ సమావేశంలో 21 అంశాలపై చర్చించాం

- మొదటి పేజీ తరువాయి

బుడమేరు, 10 జిల్లాల్లో వరద ప్రాంతాల్లో రుణాలను రీషెడ్యూల్ చేసేందుకు ఆమోదించినట్టు తెలిపారు. రూ.50 వరకు ఉన్న రుణాలపై స్టాంప్ డ్యూటీ మినహాయించాలని నిర్ణయించినట్టు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కోసం ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా రూ.1000 కోట్ల రుణానికి ప్రభుత్వం గ్యారెంటీ ఇవ్వడంపై కూడా నేటి మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపినట్టు మంత్రి పార్థసారథి వివరించారు.

పోలవరం ఎడమ కాలువ రీ-టెండరింగ్ కు ఆమోదం లభించిందని, పుంగనూరు బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు. క్లీన్ ఎనర్జీ కోసం ఎన్టీపీసీ ద్వారా పెట్టే పెట్టుబడుల కోసం జాయింట్ వెంచర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. రూ.1.70 లక్షల కోట్ల పెట్టుబడులతో విద్యుదుత్పత్తి యూనిట్ల స్థాపనకు నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు.

475 జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం అందించే పథకానికి ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రలో 1.41 లక్షల మంది ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతుందని వివరించారు.హడ్కో ద్వారా రూ.11 వేల కోట్ల రుణం తీసుకునేందుకు క్యాబినెట్ ఆమోదించిందని చెప్పారు. జర్మనీకి చెందిన కేఎఫ్ డబ్ల్యూ ద్వారా రూ.5 వేల కోట్ల రుణానికి కూడా మంత్రివర్గం అనుమతించిందని అన్నారు.

గత ప్రభుత్వ చేతకానితనం వల్లే ఈ నష్టం: మంత్రి పార్థసారథి
గత ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ ను నిర్వీర్యం చేసిందని, తాము ఆ పథకాన్ని పునరుద్ధరిస్తామని మంత్రి పార్థసారథి వివరించారు. గత ప్రభుత్వం చేతకానితనం, దుష్పరిపాలన కారణంగా రాష్ట్రం ఎంత నష్టపోయిందో చెప్పడానికి ఈ జల్ జీవన్ మిషన్ ఒక ఉదాహరణ అని అన్నారు.

ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించాలని జల్ జీవన్ మిషన్ కింద కేంద్ర ప్రభుత్వం నిధులు జారీ చేసిందని, కొన్ని చిన్న రాష్ట్రాలు సైతం లక్ష కోట్ల నుంచి లక్షన్నర కోట్ల రూపాయల మేర పనులు చేశాయని వివరించారు. మనకంటే చిన్న రాష్ట్రం కేరళ రూ.70 వేల కోట్ల వరకు ప్రతిపాదనలు పంపిందని తెలిపారు. కానీ మన రాష్ట్రంలో రూ.26,804 కోట్లకు ప్రతిపాదనలు పంపి, అందులోనూ రూ.4 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని మంత్రి పార్థసారథి ఆరోపించారు. ఇలాంటి నష్టాలు కోకొల్లలు అని విమర్శించారు. గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా ప్రజలు పరిశుభ్రమైన తాగునీటికి దూరమయ్యారని వ్యాఖ్యానించారు.

# బీజేపీ ఎంపీలు నన్ను నెట్టేశారు... నాకు గాయమైంది

- మొదటి పేజీ తరువాయి

కిందపడిపోయానని వెల్లడించారు.

తన మోకాళ్లకు గాయమైందని ఆ లేఖలో పేర్కొన్నారు. తన మోకాళ్లకు అప్పటికే శస్త్రచికిత్స జరిగిందని, ఇప్పుడు కిందపడడంతో గాయం ప్రభావం మోకాళ్లపై ఎక్కువగా పడిందని ఖర్గే వివరించారు. వెంటనే కాంగ్రెస్ ఎంపీలు ఓ కుర్చీ తీసుకురావడంతో దానిపై కూర్చున్నానని తెలిపారు. అక్కడ్నించి తాను కుంటుతూనే సభకు వెళ్లానని పేర్కొన్నారు.

ఈ తోపులాట ఘటనపై విచారణ జరిపించాలని తన లేఖలో డిమాండ్ చేశారు. రాజ్యసభ విపక్ష నేతపై ఇలాంటి దాడి జరగడం గర్హనీయమని వివరించారు.

# కుల్గాంలో భారీ ఎన్‌కౌంటర్.. ఐదుగురు ఉగ్రవాదుల హతం

- మొదటి పేజీ తరువాయి

అందుకున్న జమ్మూకశ్మీర్ పోలీసులు, ఆర్మీ అధికారులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించారు. ఉగ్రవాదులు తలదాచుకున్న ఇంటిని భద్రతా బలగాలు చుట్టుముట్టడాన్ని గ్రహించిన తీవ్రవాదులు బయటకు వచ్చి విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన సెక్యూరిటీ సిబ్బంది ఎదురుకాల్పులు ప్రారంభించారు. కాల్పులు ఆగిన తర్వాత చూస్తే ఐదుగురు ఉగ్రవాదుల మృతదేహాలు కనిపించాయి. ఈ ఏడాది కుల్గాంలో జరిగిన రెండో అతిపెద్ద ఎన్‌కౌంటర్ ఇదేనని అధికారులు తెలిపారు. జులై 8న ఇక్కడ జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ఆరుగురు మిలిటెంట్లు హతమవగా ఇద్దరు సైనికులు అమరులయ్యారు.

# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోంది

- మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు హామీలు ఇచ్చారని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు.

వైసీపీ హయాంలో మేనిఫెస్టోలోని ప్రతి అంశాన్ని అమలు చేశామని జగన్ చెప్పారు. మేనిఫెస్టోకు పవిత్రతను తీసుకొచ్చామని తెలిపారు. కరోనా వచ్చినా, ప్రభుత్వ ఆదాయం తగ్గినా, ఖర్చులు పెరిగినా సాకులు చూపకుండా ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను, వాగ్దానాలను అమలు చేశామని చెప్పారు. తప్పుడు హామీలతో ప్రజలను చంద్రబాబు నమ్మించగలిగారని... జగన్ చేశారు కదా... చంద్రబాబు కూడా చేస్తారేమోనని ప్రజలు నమ్మారని... అందుకే మనం పరాజయం చెందామని అన్నారు. ఆరు నెలలు గడవకుండానే చంద్రబాబు మోసాలను ప్రజలు గుర్తించారని చెప్పారు. చంద్రముఖిని లేపడమంటే పులి నోట్లో తల పెట్టడమేనని ఆరోజు చెప్పానని...

ఈరోజు దాన్ని చంద్రబాబు నిజం చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు బిర్యానీ పెడతానన్నారని... ఇప్పుడు బిర్యానీ పోయింది, పలావు కూడా పోయిందని ఎద్దేవా చేశారు. ప్రజలకు పథకాలు అందడం లేదని చెప్పారు. కరెంటు ఛార్జీల రూపంలో ప్రజలపై వేల కోట్ల భారాన్ని వేశారని మండిపడ్డారు. స్కామ్ ల మీద స్కామ్ లు నడుస్తున్నాయని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని చెప్పారు.

# మంత్రి నిమ్మల రామానాయుడుకి హరిరామ జోగయ్య లేఖ

- మొదటి పేజీ తరువాయి

నిర్మాణాల పేరుతో కోట్ల రూపాయలను ఖర్చు చేయడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనని జోగయ్య విమర్శించారు. ఇది నిజమైన అభివృద్ధి అనిపించుకోదని చెప్పారు. నరసాపురం, భీమవరం, రాజోలు నియోజకవర్గాలకు సమదూరంలో ఉన్న పాలకొల్లు నియోజకవర్గంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎవరికైనా పెద్ద వైద్య అవసరం వస్తే హైదరాబాద్ కు కానీ, వైజాగ్ కు కానీ వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. ఆ ఇబ్బందుల నుంచి బయటపడటానికి ఆరోగ్యశ్రీ సదుపాయం కలిగిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అవసరం ఉందని తెలిపారు. దీనికి ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు.

# అంబేద్కర్ కు ఎవరి ద్వారా గుర్తింపు వచ్చిందనే అంశంపై చర్చ జరగాలి

- మొదటి పేజీ తరువాయి

చేశారు. మనం మంచి ఉద్దేశంతో మాట్లాడినా, చెడుగా ప్రచారం చేసేవారు ఉంటారని తెలిపారు. వ్యవసాయం దండగ అని అనకపోయినా, నేను ఆ మాట అన్నట్టుగా ప్రచారం చేశారని చంద్రబాబు వెల్లడించారు.

కాంగ్రెస్ హయాంలో అంబేద్కర్ కు తగిన గౌరవం లభించలేదని, అప్పట్లో అంబేద్కర్ ఓడిపోయింది కూడా కాంగ్రెస్ హయాంలోనే అని గుర్తు చేశారు. వీపీ సింగ్ హయాంలో పార్లమెంటు ఆవరణలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారని తెలిపారు. అంబేద్కర్ కు ఎవరిద్వారా గుర్తింపు వచ్చిందనే అంశంపై జరగాలని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. కేంద్రమంత్రి అమిత్ షా... అంబేద్కర్ పై వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తడం తెలిసిందే. ఇవాళ పార్లమెంటు ప్రాంగణంలో బీజేపీ, కాంగ్రెస్ ఎంపీల మధ్య తోపులాట జరిగి పలువురు ఎంపీలుగా గాయపడి ఆసుపత్రిపాలయ్యారు. అమిత్ షాపై కాంగ్రెస్ పార్టీ నిప్పులు చెరుగుతున్న నేపథ్యంలో, చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

**మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై అభిప్రాయసేకరణ**

ఇక. కూటమి ప్రభుత్వంలో ఉదాసీన వైఖరికి తావులేని సీఎం చంద్రబాబు మంత్రివర్గ సహచరులకు, ఎమ్మెల్యేలకు స్పష్టం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై ఐవీఆర్ఎస్ విధానంలో అభిప్రాయ సేకరణ జరుపుతున్నానని తెలిపారు. మంత్రులు పనితీరు, ప్రభుత్వ పనితీరు పరంగా ప్రజల నుంచి సమాచారం తెప్పిస్తున్నానని చంద్రబాబు వెల్లడించారు.

ఆరు నెలల

పనితీరుపై ముగ్గురు మంత్రులు మాత్రమే సెల్ఫ్ అప్రైజల్ ఇచ్చారని వివరించారు. నిమ్మల రామానాయుడు, గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్ మాత్రమే సెల్ఫ్ అప్రైజల్ ఇచ్చారని తెలిపారు. మంత్రులు తమ పేషీలకు మాత్రమే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయి పర్యటనలు పెంచాల్సిన అవసరం ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు.

అంతేగాకుండా, మంత్రులు సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కక్ష సాధింపు ధోరణి అనుసరించవద్దని, విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని పిలుపునిచ్చారు.

### అంబేద్కర్ రాజ్యాంగం స్థానంలో
# మనుస్మృతిని తెచ్చేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోంది

- మొదటి పేజీ తరువాయి

అంబేద్కర్ పై వ్యాఖ్యలతో దళితులు, గిరిజనుల మనోభావాలను అమిత్ షా దెబ్బతీశారని ఆరోపించారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతిని అమలు చేసేందుకు సంఘ్ పరివార్ తో కలిసి బీజేపీ కుట్రలు పన్నుతోందని షర్మిల సంచలన ఆరోపణలు చేశారు.

మనుస్మృతిని విశ్వసిస్తుంది కాబట్టే బీజేపీ అనుక్షణం రాజ్యాంగంపై దాడికి పాల్పడుతోందని అన్నారు. బహిరంగ సభా వేదికలతో పాటు సాక్షాత్తూ పార్లమెంట్ లోనే అంబేద్కర్ ను అవమానిస్తున్నారని, హేళన చేస్తున్నారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యసభలో అంబేద్కర్ పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అమిత్ షా వ్యాఖ్యలకు నిరసనగా, ఏఐసీసీ పిలుపు మేరకు ఆంధ్రప్రదేశ్ లో పలు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్ షర్మిల తెలిపారు.

# సినీ దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు రూ. 2.10 కోట్లు అక్రమంగా చెల్లించారు

- మొదటి పేజీ తరువాయి

జరుగుతోందని వెల్లడించారు. గత వైసీపీ ప్రభుత్వం కేబుల్ ఆపరేటర్లను వేధింపులకు గురి చేసిందని మండిపడ్డారు. అప్పటి ఏపీ ఫైబర్ నెట్ ఎండీ మధుసూదన్ రెడ్డిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని జీవీ రెడ్డి తెలిపారు. వైసీపీ నేతల అక్రమాలు బయటపడకుండా కీలక పత్రాలను మార్చేశారని మండిపడ్డారు. కీలక దస్త్రాలను వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డికి ఓ మహిళా ఉద్యోగి చేరవేశారని చెప్పారు. ఆమెను ఉద్యోగం నుంచి తొలగించామని వెల్లడించారు.

# సజ్జల భార్గవరెడ్డికి హైకోర్టులో మరోసారి స్వల్ప ఊరట



వైసీపీ నేత సజ్జల భార్గవ రెడ్డికి ఏపీ హైకోర్టులో మరోసారి స్వల్ప ఊరట లభించింది. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్ లపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ నేత సజ్జల భార్గవరెడ్డిపై కేసులు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసులను కొట్టివేయాలని కోరుతూ ఆయన ఏపీ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ ను ఈరోజు హైకోర్టు విచారించింది. భార్గవరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది, వైసీపీ నేత పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. ఇది విచారణకు అర్హత లేని కేసు అని ఆయన కోర్టుకు తెలిపారు. ఎవరిపై అయితే పోస్టులు పెట్టారో... వారు ఫిర్యాదు చేయలేదని చెప్పారు. ఎవరో మూడో వ్యక్తి చెపితే కేసులు నమోదు చేశారని చెప్పారు. ఐటీ సెక్షన్స్ కు బదులుగా, నాన్ బెయిలబుల్ సెక్షన్స్ పెట్టారని అన్నారు. ఈ క్రమంలో, బీఎన్ఎస్ సెక్షన్ 35 (3)కి అనుగుణంగా నోటీసులు జారీ చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి మొదటి వారానికి వాయిదా వేసింది. భార్గవరెడ్డిపై చర్యలు తీసుకోవద్దన్న ఆదేశాలను అప్పటి వరకు పొడిగిస్తున్నట్టు తెలిపింది.

# జనవరి 10 నుంచి వైకుంఠ దర్శనాలు

**తిరుమల, డిసెంబర్ 19, పెన్ పవర్:** తిరుమల తిరుపతి దేవస్థానం జనవరి 10, 2025 నుండి జనవరి 19, 2025 వరకు తిరుమలలో జరిగే పవిత్రమైన వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు సన్నాహాలు ప్రారంభించింది. 10 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలపై టీటీడీ ఈవో జె.శ్యామలారావు, అదనపు ఈవో సిహెచ్.వెంకయ్య చౌదరి అధికారులతో కలిసి అన్నమయ్య భవన్‌లో ఏర్పాట్లు నిర్వహించి, సమీక్ష చేశారు. వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి ఈ నెల 23న ఉదయం 11 గంటలకు 10 రోజుల శ్రీవాణి టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారని ఈవో తెలిపారు. ఈ నెల 24న ఉదయం 11 గంటలకు 10 రోజుల ఎస్ఈడీ టోకెన్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారన్నారు.శ్రీవాణి ట్రస్ట్-లింక్డ్ వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్ల కోటాను డిసెంబరు 23న ఆలయ నిర్వాహకులు విడుదల చేస్తారని శ్యామలరావు చెప్పారు. ఉత్సవ కాలానికి సంబంధించిన రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్ల కోటాను కూడా టీటీడీ విడుదల చేస్తుంది. టీటీడీ ఉత్సవాల్లో భాగంగా 10 రోజుల పాటు తిరుపతిలో ఎనిమిది టికెట్ కౌంటర్లు, తిరుమలలో ఒక కౌంటర్‌ను ఏర్పాటు చేస్తుంది.టోకెన్లు లేదా టికెట్లు ఉన్న భక్తులు మాత్రమే శ్రీవారి దర్శనానికి అనుమతి ఉంటుంది. టోకెన్ లేని భక్తులు తిరుమలకు రావచ్చు గానీ వారికి దర్శనం లభించదు. టోకెన్లు లేదా టికెట్లు లేని భక్తులను క్యూ లైన్లలోకి అనుమతించరు. వైకుంఠ ఏకాదశి నాడు తెల్లవారుజామున 4:45 నిమిషాలకు ప్రొటోకాల్ దర్శనాలు ప్రారంభమౌతాయి. ఈ క్రమంలో వైకుంఠ ఏకాదశి రోజున వేదాశీర్వచనాలు కూడా రద్దవుతాయి. ఆ రోజున ఉదయం 9 నుండి 11 గంటలు వరకు స్వామివారు స్వర్ణ రథంపై ఊరేగుతారు. వైకుంఠ ద్వాదశి రోజున తెల్లవారు జామున 5:30 నుండి 6:30 వరకు శ్రీవారి పుష్కరిణిలో టీటీడీ అధికారులు చక్రస్నానం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.వైకుంఠ ఏకాదశి రోజు (జనవరి 10) దర్శనానికి ప్రోటోకాల్ వీఐపీలను మాత్రమే అనుమతిస్తామని టీటీడీ ప్రకటించింది. ఉత్సవాల కోసం భారీ యాత్రికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, 10 రోజుల పండుగ కాలంలో తిరుమలలో వేదాశీర్వచనం, అన్ని రకాల విశేష దర్శనాలను ఆలయ సంస్థ రద్దు చేసింది. కాగా, సంప్రదాయం ప్రకారం, జనవరి 10న తిరుమలలో జరిగే స్వర్ణ రథోత్సవం, మరుసటి రోజు వైకుంఠ ద్వాదశి సందర్భంగా చక్రస్నానం



కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రోజుకు 3.5 లక్షల లడ్డూలను తయారు చేసి భక్తులకు పంపిణీ చేయడంతో పాటు 3.5 లక్షల లడ్డూలను టీటీడీ బఫర్ స్టాక్‌లో ఉంచనుంది.

**టీటీడీ నిర్ణయాలివే..**

వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి ఈ నెల 23న ఉదయం 11 గంటలకు 10 రోజుల శ్రీవాణి టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఈ నెల 24న ఉదయం 11 గంటలకు 10 రోజుల ఎస్ఈడీ టోకెన్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.జనవరి 10 నుంచి 19 వరకూ 10 రోజులకు వైకుంఠ ద్వార దర్శనాలకు సంబంధించి తిరుపతిలో 8 కేంద్రాలు, తిరుమలలోని ఒక కేంద్రంలో సర్వదర్శనం టోకెన్లు కేటాయిస్తారు.

తిరుపతిలోని ఎం.ఆర్.పల్లి, జీవకోన, రామానాయుడు స్కూల్, రామచంద్ర పుష్కరిణి, ఇందిరా మైదానం, శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్, తిరుమలలోని కౌస్తుభం విశ్రాంతి భవనంలో టోకెన్లు కేటాయిస్తారు.టోకెన్ జారీ కేంద్రాల వద్ద భక్తులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సీఈకి ఆదేశం. టోకెన్లు, టికెట్లు ఉన్న భక్తులకు మాత్రమే దర్శనాలకు అనుమతి ఇస్తారు. టోకెన్లు లేని భక్తులను దర్శన క్యూలైన్లలోకి అనుమతించరు.

వైకుంఠ ఏకాదశి రోజున ఉదయం 04:45 గంటలకు ప్రోటోకాల్ దర్శనాలు ప్రారంభం కాగా.. అధిక రద్దీ కారణంగా ఆ రోజున ఆలయంలో వేదాశీర్వచనం రద్దు చేశారు.ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకూ స్వర్ణరథం, ఉదయం 5:30 నుంచి 6:30 వరకూ శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం జరుగుతాయి. గోవిందమాల భక్తులకు ఎలాంటి ప్రత్యేక దర్శన సదుపాయం ఉండదు.

# పార్టీకి తలనొప్పిగా మారిన కొలికపూడి

**విజయవాడ, డిసెంబర్ 19, పెన్ పవర్:** ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీకి తలనొప్పిగా తయారైన ఎమ్మెల్యేల్లో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఒకరు. పార్టీ నేతలతో వివాదాలు, కర్ర పెత్తనం, దూషణలతో తీరు మార్చుకోమని పార్టీ పెద్దలు పదేపదే చెబుతున్నా ఆయనలో మాత్రం మార్పు రావడం లేదు.ఎన్టీఆర్ జిల్లా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మంగళవారం బెల్ట్‌షాపులపై దాడుల పేరుతో చేసిన హడావుడితో టీడీపీ ఇరకాటంలో పడింది. రాష్ట్రంలో ఎక్కడా బెల్ట్‌షాపులే లేవని ఓ పక్కన ఎక్సైజ్ మంత్రి మొదలుకుని ముఖ్యమంత్రి వరకు గొప్పలు చెబుతుంటే అధికార పార్టీ ఎమ్మెల్యే రోడ్లపై పరుగులు తీస్తూ బెల్టు దుకాణాల్లో తనిఖీలు చేస్తూ, అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని పట్టుకోవడం కలకలం రేపింది. ఎమ్మెల్యే ఇలా ఎందుకు చేశారనే దానిపై రకరకాల వాదనలు ఉన్నా టీడీపీ నేతలు మాత్రం ఎమ్మెల్యే తీరును తప్పు పడుతున్నారు. అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే కొలికపూడి కంట్రవర్సీకి కేరాఫ్ అడ్రస్ అయ్యారు.అధ్యాపక వృత్తి నుంచి అమరావతి ఉద్యమంలోకి అడుగుపెట్టిన కొలికపూడి శ్రీనివాసరావును ఎన్టీఆర్ జిల్లా తిరువూరు రిజర్వుడు నియోజక వర్గం నుంచి పోటీ చేసే అవకాశం లభించింది. కూటమి ప్రభంజనంలో సునాయసంగానే గెలిచారు. గెలిచిన తర్వాత ఎమ్మెల్యే తీరులో ఒక్కసారిగా మార్పు వచ్చింది. నియోజక వర్గం మొత్తం తన చెప్పు చేతల్లో ఉండాలనే ధోరణిలో ఉండటంతో స్థానికంగా విభేదాలు మొదలయ్యాయి. దీనికి తోడు స్థానికంగా ఉండే కుల, వర్గ రాజకీయాలు కూడా ఎమ్మెల్యేకు మింగుడు పడలేదు. తిరువూరులో ఉండే కుల ఆధిపత్య ధోరణులు కూడా ఎమ్మెల్యే వైఖరికి కారణమనే ప్రచారం కూడా ఉంది.ఎమ్మెల్యేగా ఎన్నికైన నెలరోజుల్లోనే..

ఈ ఏడాది జూలైలో ఎ.కొండూరు మండలం కంభంపాడులో వైసీపీ నాయ కుడు పంచాయతీ స్థలం ఆక్రమించి, భవనం నిర్మిస్తు న్నాడని ఆరోపిస్తూ ఆ భవనం వద్దకు వెళ్లి జేసీబీతో దానిని పడగొట్టాల్సిందేనని ఆందోళనకు దిగారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటా మని అధికారులు చెప్పినా వినకుండా అక్కడే బైఠాయించారు. ఈ ఘటన సంచలనం కావడంతో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఉండవల్లి పిలిపించుకుని మందలించారు.ఆ తర్వాత పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నారనే నెపంతో టీడీపీ ప్రజాప్రతినిధిని అందరి ముందు బట్టలిప్పి కొడతానంటూ బెదిరించడంతో అతని భార్య ఆత్మహత్యా యత్నం చేసింది. దీంతో అతని వర్గం నాయకులు విజయవాడలో ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగడం కలకలం రేపింది. తిరువూరులో మట్టి తరలింపుపై మీడియాలో వార్తలు రావడంతో వారిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో ఎమ్మెల్యేపై స్థానిక నాయకులు టీడీపీ పెద్దలకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికార పార్టీ ఎమ్మెల్యే ఉండగానే నియోజక వర్గానికి మరో ఇన్‌ఛార్జిని నియమించారు. పార్టీలో ఇతర నేతలు జోక్యం చేసుకుని

సర్ది చెప్పడంతో తీరు మార్చుకుంటానని బహిరంగంగా ప్రకటించారు మళ్లీ కొలికపూడి చెలరేగిపోయారు. వీధుల్లో పరుగులు తీస్తూ మద్యం దుకాణాల వద్ద హంగామా చేశారు. ఉదయాన్నే మద్యం షాపులకు వెళ్లి బెల్టు షాపులు నిర్వహిస్తున్నా

రంటూ షాపులకు తాళాలు వేయిం చారు. షాపు తాళాలు తీస్తే ఊరుకోనంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరువూరు పట్టణంలో ఉన్న షాపుల్ని పట్టణ శివార్లలో పెట్టుకోవాలని, బెల్టుషాపుల్ని తొలగించకపోతే తానే తొలగిస్తానంటూ మండిపడ్డారు.తిరువూరు నియోజక వర్గంలో ఉన్న 16 మద్యం షాపుల్లో తిరువూరు పట్టణంలో 4, రూరల్‌లో 2, గంపలగూడెంలో 4, ఎ. కొండూరులో 2, విస్సన్నపేటలో 4 షాపులు ఉన్నాయి. మద్యం వ్యాపారంపై ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడం దుకాణాలు మూయించడంపై నిర్వాహకులు బిత్తరపోతున్నారు. ఎమ్మెల్యే వేధింపులపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయాలని యోచిస్తున్నారు. మరోవైపు టీడీపీ అధిష్టానం కూడా ఎమ్మెల్యే వ్యవహార శైలిపై విచారణ జరుపుతోంది.

# అమరావతిపై పొంగులేటీ కామెంట్స్ మండిపడుతున్న ఏపీ నేతలు

**విజయవాడ, డిసెంబర్ 18, పెన్ పవర్:**"ఇటీవల అమరావతిలో వచ్చిన వరదలతో ఏపీకి పెట్టుబడులు వెళ్లే పరిస్థితి లేదు. వరదలతో ఏపీలో పెట్టుబడులు పెట్టే వారికి భయం పట్టుకుంది. ఏపీలో చంద్రబాబు అధికారం చేపట్టగానే రియల్ ఎస్టేట్ అమరావతికి పోతుందనేది ప్రచారం మాత్రమే. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోలేదు. హైదరాబాద్, బెంగళూరుకు పెట్టుబడిదారులు వస్తున్నారు" అని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు.హైదరాబాద్ లో రియల్ ఎస్టేట్ పెట్టుబడులు తగ్గుతున్నాయని, అందుకు కాంగ్రెస్ ప్రభుత్వ పోకడలే కారణమని బీఆర్ఎస్ విమర్శలు చేస్తుంది. ఏపీలో అమరావతి పనులు మళ్లీ ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అమరావతిపై హాట్ కామెంట్స్ చేశారు. ఏపీలో కూటమి సర్కార్ ఏర్పడడంతో...అమరావతికి మళ్లీ ఊతం లభించింది. గత ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోని రాజధాని ప్రాజెక్టు మళ్లీ పట్టాలెక్కింది. రాజధాని కోసం వేల ఎకరాలు ఇచ్చిన రైతులు, అమరావతి ప్రజల్లో కొత్త ఆశ చిగురించింది. ఇది కొంత వరకూ వాస్తవమే. అయితే రాత్రికి రాత్రే మారిపోయి, పెట్టుబడిదారులు క్యూ కట్టే పరిస్థితులు అమరావతిలో లేవనే చెప్పాలి. కూటమి ప్రభుత్వం రాగానే అమరావతిపై దృష్టి పెట్టి మొదటిగా జంగిల్ క్లియరెన్స్ చేపట్టింది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఒక సంకేతం పంపింది. సీఆర్డీఏను రంగంలోకి దింపి రాజధాని అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రజల్లో నమ్మకాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తుంది.ఇటీవల సీఆర్డీఏ భేటీలో రూ.24,276 కోట్ల పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అమరావతిలో మొత్తంగా రూ.45,249 కోట్ల పనులకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్ నిర్మాణాలు, రాజధాని లే ఔట్‌లు, ట్రంక్ రోడ్లు, అసెంబ్లీ భవనాల నిర్మాణాలకు సీఆర్డీఏ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అమరావతి రాజధాని నిర్మాణానికి మొత్తం ఖర్చు రూ.62 వేల కోట్లుగా ప్రభుత్వం అంచనా వేస్తుంది. అమరావతి పనులకు కసరత్తు ప్రారంభం కావడంతో...రియల్ ఎస్టేట్ వ్యాపారుల చూపు అటుగా మళ్లింది. గతంలో కంటే భూముల రేట్లు పెరుగుతున్నాయి. ప్రస్తుతానికి రోడ్లు తప్ప ఇతర మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో...భవిష్యత్ అవసరాలకు మాత్రమే భూములు కొనుగోలు చేస్తున్నారు.'అమరావతి, చుట్టుపక్కల ప్రభుత్వ, ప్రైవేట్ భూములు సుమారు 50,000 ఎకరాల వరకు అందుబాటులో ఉన్నాయి. గతంలో చదరపు గజం రూ. 15,000 ట్రెండ్ అవ్వగా...ఇటీవల చదరపు గజం రూ. 25,000 ధరకు చేరింది' అని ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి అన్నారు. రియల్ ఎస్టేట్ బూమ్ ప్రారంభం అయ్యిందని, వార్షిక ప్రాతిపదికన భూముల రేట్లు పెరిగే అవకాశం ఉందని రియల్ వ్యాపారులు భావిస్తున్నారు. మరో 18 నెలల్లో భూముల ధరలు రెట్టింపు అవుతాయని ఆశిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసంపూర్తిగా ఉన్న కొన్ని భవనాల పనులు ప్రారంభించిందని, వీటిలో 80 శాతం వరకు పనులు పూర్తయ్యాయని, బ్యూరోక్రాట్‌లు, శాసనసభ్యులు, న్యాయమూర్తుల నివాస గృహాలు ఉన్నాయని సీఆర్డీఏ అధికారులు పేర్కొన్నారుహైదరాబాద్, బెంగళూరులో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతుండడంతో... భవిష్యత్ అవసరాల కోసం కొందరు అమరావతి వైపు వస్తున్నారని రియల్ వ్యాపారులు అంటున్నారు. జనవరి2025 నుంచి బెంగళూరు, హైదరాబాద్‌లతో పోటీ పడుతూ అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం సాగుతుందని భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ మద్దతు, వరల్డ్ బ్యాంక్, ఏడీబీ రుణాలు సకాలంలో అందితే అమరావతి రియల్ రంగంలో మరింత స్పీడ్ అందుకుంటుందని స్థానిక వ్యాపారులు భావిస్తున్నారు. అమరావతిలో ఇప్పటికే కొన్ని పనులను పునఃప్రారంభం కావడంతో భూముల ధరలకు రెక్కలు వస్తు?న్నాయి. స్థానిక రియల్టర్ల ప్రకారం అమరావతి గ్రామాలలో భూముల ధరలు 60% నుంచి 100% వరకు పెరిగి చ.గజం రూ. 50,000 తాకవచ్చని తెలుస్తోంది.గత 10 ఏళ్లలో అమరావతి రియల్ ఎస్టేట్ రంగం ఎన్నో కుదుపులు చూసింది. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత అప్పటి సీఎం చంద్రాబబు అమరావతిని రాష్ట్రానికి రాజధానిగా ప్రకటించడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. 217 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో రియల్ ఎస్టేట్ రంగంపై ఎన్నో ఊహాగానాలు వచ్చాయి. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి రావడం, వైఎస్ జగన్ మూడు రాజధానుల ప్రతిపాదనతో అమరావతి ధరలు అమాంతం తగ్గిపోయాయి. అమరావతిలో 2019లో చదరపు గజానికి రూ.25,000-రూ.40,000 వరకు ఉండగా..జగన్ ప్రభుత్వ హయాంలో వీటి ధరలు రూ.9,000-రూ.18,000కి పడిపోయాయని ఓ రియాల్టీ వ్యాపారి అన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడంతో అమరావతి భూముల ధరలు పెరుగుతున్నాయి. మొత్తం 29 గ్రామాల్లో ఎకరాకు రూ.3 కోట్ల నుంచి రూ.6 కోట్ల వరకు ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు.భూముల ధరలు భారీగా పెరగడంతో అమరావతిపై పెట్టుబడిదారులకు ఆసక్తి ఉందని తెలుస్తోంది. వెలగపూడి, కొండంపాలెం, వీఐటీ, ఎస్ఆర్ఎం వంటి విద్యాసంస్థలకు సమీపంలోని ప్రాంతాల్లో వాణిజ్య, నివాస ప్రాజెక్టుల ధరలు భారీగా పెరుగుతున్నాయని స్థానికి డెవలపర్స్ చెబుతున్నారు. అమరావతి నిర్మాణానికి ప్రభుత్వం సానుకూలంగా ఉండటంతో, హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పెట్టుబడిదారులు ఏపీకి తిరిగి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారని, రాబోయే కొన్నేళ్లలో ఈ ప్రాంతంలో ఆశాజనక ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందని అమరావతి రియల్ వ్యాపారులు అంటున్నారు.అమరావతి రియల్ ఎస్టేట్ ప్రభావం హైదరాబాద్ పడుతుందనే ఆలోచనలో తెలంగాణ మంత్రి పొంగులేటి...నెగిటివ్ కామెంట్స్ చేసి ఉంటారని కొందరు వ్యాపారులు అంటున్నారు. ఇటీవల హైదరాబాద్ లో కూడా వరద పరిస్థితులు కనిపిస్తున్నాయని, చెన్నై, బెంగళూరులో సైతం వర్షాలు చాలా ప్రాంతాలు నీటి మునుగుతున్నాయని చెబుతున్నారు. పొంగులేటి వ్యాఖ్యలను రాజకీయ కోణంలోనే చూడాలని టీడీపీ నేతలు అంటున్నారు. బీఆర్ఎస్ విమర్శలను తిప్పికొట్టేందుకు పొంగులేటి అమరావతి ప్రస్తావన తెచ్చి ఉంటారని భావిస్తున్నారు. అమరావతితో పాటు సాగర నగరం విశాఖలో పెట్టుబడులకు మంచి అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

## జగన్ కు దూరమౌతున్న కాపు వర్గం



**విజయవాడ, డిసెంబర్ 19, పెన్ పవర్:** ఏపీలో అతి బలమైన ఓటు బ్యాంకు ఉన్న కాపు సామాజిక వర్గం వైసీపీ అధినేత జగన్‌ను వదిలి పెడుతోందా..? ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో ఈ చర్చ ఎక్కువగా జరుగుతోంది. ఆ మధ్య ఒకేసారి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ రాజీనామా చేయడంతో ఈ చర్చ మరింత ఎక్కువైంది.2024 ఎన్నికల్లో వైసిపి ఓటమి చెందిన తర్వాత కాపు సామాజిక వర్గ నేతలు వరుసగా ఆ పార్టీకి దూరం అవుతున్నారు. ముందుగా కిలారు రోశయ్య, సామినేని ఉదయభాను లాంటి నేతలు పార్టీకి రాజీనామా చేస్తే ఆ తర్వాత జగన్‌కు అత్యంత నమ్మకమైన స్నేహితుడిగా ఉన్న ఆళ్లనాని కూడా పార్టీకి రాజీనామా చేశారు. ఇది వైసిపినే కాకుండా రాష్ట్ర రాజకీయాలను కూడా షాక్‌కు గురి చేసింది. నిజానికి తొలి విడతలోనే ఆళ్ల నానిని మంత్రిని చేశారు జగన్మోహన్ రెడ్డి. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో మంత్రి పదవి కోల్పోయినప్పుడు నుంచి ఆయన ముభావంగానే ఉంటూ వచ్చారు. పార్టీ అధికారం కోల్పోగానే జగన్‌కు బై బై చెప్పేశారు. భీమవరంలో గ్రంధి శ్రీనివాస్‌ది కూడా అదే దారి. ఏకంగా 2019లో జనసేన అధినేత పవన్‌ను ఓడించి జయింట్ కిల్లర్‌గా పేరుపొందిన గ్రంధి శ్రీనివాస్‌కు కనీసం రెండో విడతలోనన్నా మంత్రి పదవి గ్యారెంటీ అని భావించారు. కానీ పలు సమీకరణల దృష్ట్యా జగన్ ఆయనపై దృష్టి పెట్టలేదు. దీనితో తనకు సరైన గుర్తింపు దక్కలేదని ఎప్పటినుంచో భావిస్తున్న గ్రంధి శ్రీనివాస్ ఎన్నికల తర్వాత పార్టీని వదిలేసారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే అటు వైపు వెళ్ళిపోతారన్న విమర్శలు ఎదుర్కొనే అవంతి శ్రీనివాస్ కూడా వైసిపి నుంచి బయటికి వచ్చేసారు. జగన్ హయాంలో ఆయన మంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతానికి వీరు మాత్రమే కాకుండా మరికొందరు కాపు నేతలు కూడా వైసీపీని వీడే ఆలోచనలో ఉన్నట్టు సమాచారం.ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో జనసేన కాపులను, కాపులు జనసేన ను ఓన్ చేసుకుంటున్నారు. పవన్‌ను ఒక సీరియస్ పొలిటిషన్‌గా వారు గుర్తించడానికి కొంత టైం పట్టింది. ఎప్పటికైనా ఏపీలో కాపు సామాజిక వర్గం నుంచి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం ఉన్న వ్యక్తిగా పవన్ని చూస్తున్నారు. దాని ఫలితమే 2024 ఎన్నికల్లో జనసేన సాధించిన 100% విజయం. ఇలాంటి పరిస్థితుల్లో వేరే పార్టీల్లో ఉండటం కన్నా జనసేనకు షిఫ్ట్ కావడమే మంచిదనే ఆలోచనలో కాపు సామాజిక వర్గానికి చెందిన నేతలు భావిస్తున్నారు. వీలైతే జనసేన లోనికో లేకుంటే కనీసం కూటమిలోని ఇతర పార్టీల్లోకో వెళ్లడం ప్రస్తుతానికి బెటరనే ఆలోచనలు వీళ్లు ఉన్నారు.విజయవాడ నుంచి ఉత్తరాంధ్ర వరకు కాపు సామాజిక వర్గం దాని అనుబంధ కులాల లీడర్లు ఎక్కువగా ఉన్నారు. ఓటర్లపరంగా కూడా వారి ప్రభావం ఈ ప్రాంతాల్లో ఉంటుంది. వైసీపీలో ఆ ప్రాంతాలకు సంబంధం లేని రెడ్డి లీడర్లు సలహాదారుల పేరుతో పెత్తనం సాగించడం చాలా మందికి నచ్చడం లేదు. జగన్‌కు తమకు మధ్య అడ్డుకట్టలా వాళ్లు మారిపోతున్నరని అసహనానికి లోనవుతున్నారు. దానికి తోడు జగన్ కూడా క్షేత్ర స్థాయి పరిస్థితులను లెక్క లోకి తీసుకోకుండా తోచినట్టు చేసుకుపోతున్నారనే ఆరోపణ ఉంది. ఇక తమ సామాజిక వర్గానికి చెందిన పవన్‌ను తమ తోనే తిట్టిస్తూ రావడం వల్ల ఓటు బ్యాంకు పూర్తిగా దెబ్బతింటుందని భావించిన కాపు లీడర్లు వైసీపీకి బై బై చెప్తున్నారు. మరి రానున్న రోజుల్లో ఇంకెంత మంది కాపు లీడర్లు బయటకు వస్తారో జగన్ వారికి ఎలా అడ్డుకట్ట వేస్తారో చూడాలి.

## దొంగతనం అంత ఈజీనా...

**కాకినాడ, డిసెంబర్ 19, పెన్ పవర్:** సులువుగా డబ్బులు ఎలా సంపాదించాలి అని వీడియోలు చూశాడో.. లేకపోతే దొంగతనం కేంద్రంసాగే మనీ హెయిస్ట్ లాంటి వెబ్ సిరీస్‌లు చూశాడో కానీ ఓ వ్యక్తి ఏకంగా ఓ కార్పొరేట్ గోల్డ్ షోరూంనే టార్గెట్ చేశాడు. కానీ ప్రాపర్ గా వర్కవుట్ చేయకపోవడం.. దోచుకున్న వరకే ప్లాన్ రెడీ చేసుకోవడం.. ఆ ఆ తర్వాత ఎక్కడికి వెళ్లాలో తెలియకపోవడంతో దొరికిపోయాడు. అది కూడా మామూలు పోలీసులకు కాదు.. ట్రాఫిక్ పోలీసులకు. కాకినాడ మెయిన్ రోడ్‌లో తనిష్క్ బంగారు ఆభరణాల షోరూం ఉంది. మధ్యాహ్నం సమయంలో కస్టమర్లు ఎవరూ లేరు. ఆ సమయలో ఓ యువకుడు వచ్చాడు. తనకు లావుపాటి గోల్డ్ చైన్ కావాలని చూపించమని అడిగాడు. సేల్స్ గర్ల్ ఆరేడు

మోడల్స్ చూపించింది. అన్నింటిని తన చేతుల్లోకి తీసుకున్న ఆ వ్యక్తి వెంటనే జేబులో నుంచి తుపాకీ తీసి.. కదిలితే కాల్చేస్తానని హెచ్చరించాడు.దాంతో వచ్చిన వాడు దొంగ అని తెలిసి ఆ సేల్స్ గర్ల్ వణికిపోయింది. తర్వాత అతను ఆ నగలు తీసుకుని పరారయ్యాడు. చేతిలోతుపాకీ కూడా ఉండటంతో సెక్యూరిటీ కూడా ఆపలేదు. ఆ దొంగ అలా రోడ్డు మీదకు పరుగులు పెట్టిన వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెంటనే సిటీ బయటకు అనుమానాస్పద వ్యక్తులు వెళ్లకుండా తనిఖీలు చేయమని ఆదేశాలిచ్చి షోరూంను పరిశీలించేందుకు వచ్చారు. అయితే కాసేపటికే ఫారెస్ట్ ఆఫీసు దగ్గర ఓ యువకుడ్ని పోలీసులు పట్టుకున్నారని అతని వద్ద చాలా బంగారు ఆభరణాలు ఉన్నాయని కంట్రోల్ రూమ్ కు ఫోన్ వచ్చింది. వెంటనే వెళ్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి తుపాకీ చూపించి గోల్డ్ కొట్టేసి బయటకు వచ్చాడు కానీ.. ఎటు పోవాలో అర్థం కాలేదు. ఫారెస్ట్ ఆఫీస్ సెంటర్ దగ్గర అనుమానాస్పదంగా ప్రవర్తిస్తూండటంతో ఏమైందని ట్రాఫిక్ కానిస్టేబుల్ ప్రశ్నించాడు. అప్పటికే దొంగతనం చేశానన్న ఆందోళనతో.. ?ందరూ తననే వెంటాడుతున్నారన్న భయంతో వణికిపోతున్న ఆ యువకుడు పారిపోయే ప్రయత్నం చేశాడు. తేడాగా ఉండటంతో ట్రాఫిక్ పోలీసులు అతడిని పట్టుకున్నాడు. అతని జేబుల్లో వెదికితే బంగారం లభించింది. వెంటనే కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ఉన్న గన్ స్వాధీనం చేసుకున్నారు. అది నిజమైన గన్ కాదని.. టాయ్ గన్ అని తేలింది. ఆ యువకుడ్ని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. అతను ప్రొఫెషనల్ దొంగ కాదని.. అలా అయితే.. పకడ్బందీగా దోపిడీ చేసి పారిపోయేందుకు కూడా ఏర్పాట్లు చేసుకుని ఉండేవాడని పోలీసులు భావిస్తున్నారు.

## సముద్రంలో ఫెర్రీని ఢీకొట్టిన నేవి స్పీడ్ బోటు

## 13 మంది మృతిస

**పెన్ పవర్:**ముంబై దగ్గర అరేబియా సముద్రంలో జరిగిన పడవ ప్రమాదం జరిగింది. ఒక నేవీ స్పీడ్ బోట్ వేగంగి వచ్చి గేట్ వే ఆఫ్ ఇండియా నుంచి ఎలిఫెంటా దీవులకు పర్యాటకులతో వెళ్తున్న ఫెర్రీని ఢీకొట్టింది. దీంతో ఫెర్రీ సముద్రంలో మునిగిపోయింది. ఘటనలొఓ పదమూడు మంది మృతి చెందారు. నేవీ బోట్ లో ఐదుగురు వుండగా ఫెర్రీలో 110మంది ప్రయాణికులు వున్నారు. మృతుల్లో ముగ్గురు నేవి సిబ్బంది వున్నారు. 101 మందిని కాపాడినట్లు అధికారులు తెలిపారు. నేవీ బోటు మరమత్తుల అనంతరం పరీక్షలు చేస్తుండగా అదుపు తప్పినట్లు నేవీ ప్రకటించింది.

డవ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రధాని మోదీ ?2లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి ?50,000 చొప్పున ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

నౌకా దళం, కోస్ట్ గార్డు సహాయక చర్యలు చేపట్టాయి. పదికొండు నేవి బోట్లు, మెరైన్ పోలీసుల మూడు బోట్లు బాధితులను రక్షించాయి.

# ఇంగ్లాండ్ బ్యాటర్‌ను క్లీన్ స్వీప్ చేసిన న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్



**హైదరాబాద్ పెన్ పవర్:** సిరీస్ లో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా.. డ్రా చేసుకోకుండా అన్ని మ్యాచ్ లు గెలిస్తే దానిని క్లీన్ స్వీప్ అంటారు. క్రికెట్ లో సాధారణంగా ఒక జట్టు మరో జట్టును క్లీన్ స్వీప్ చేయడం చూశాం. అయితే సిరీస్ లో ఒక బ్యాటర్ ను ప్రత్యర్థి బౌలర్ క్లీన్ స్వీప్ కూడా చేస్తారు. క్రికెట్ లో అరుదుగా జరిగే ఈ సంఘటన తాజాగా మరోసారి జరిగింది. ఇంగ్లాండ్ ఓపెనర్ జాక్ క్రాలీని న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ హెన్రీ ఒకే సిరీస్ లో ఏకంగా 6 సార్లు ఔట్ చేశాడు. ఇటీవలే ఇంగ్లాండ్, న్యూజిలాండ్ జట్ల మధ్య మూడు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ జరిగిన సంగతి తెలిసిందే. న్యూజిలాండ్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో ఇంగ్లాండ్ 2-1 తేడాతో సిరీస్ గెలిచింది. తొలి రెండు టెస్టులు ఇంగ్లాండ్ గెలిస్తే.. చివరి టెస్ట్ కివీస్ గెలిచింది. ఈ సిరీస్ లో క్రాలీకి హెన్రీ పీడకలనే మిగిలిచ్చాడు. ఆరు ఇన్నింగ్స్ ల్లో ఆరు సార్లు ఔట్ చేసిఅరుదైన రికార్డ్ ను తన ఖాతాలో వేసుకున్నాడు. హెన్రీ దెబ్బకు క్రాలీ సిరీస్ మొత్తం సింగిల్ డిజిట్ కే పరిమితమయ్యాడు.మూడు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో ఒక బ్యాటర్ ను బౌలర్ ఆరు సార్లు ఔట్ చేయడం ఇది కేవలం మూడో సారి మాత్రమే. 1985 లో న్యూజి లాండ్ ఆల్ రౌండర్ రిచర్డ్ హ్యాడ్లి 3 మ్యాచ్ ల టెస్టుల సిరీస్‌లో మాథ్యూస్ ను ఆరు సార్లు ఔట్ చేయగా.. 2006 లో సౌతాఫ్రికా బౌలర్ మకాయ ఎంతిని.. ఆస్ట్రేలియా ఓపెనర్ హైడెన్ ను మూడు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో ఆరుసార్లు ఔట్ చేశాడు.

# టీ20ల్లో నెంబర్ వన్ బౌలర్‌గా వెస్టిండీస్ స్పిన్నర్

**హైదరాబాద్ పెన్ పవర్:** వెస్టిండీస్ లెఫ్టార్మ్ స్పిన్నర్ అకేల్ హొసేన్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ లో అగ్ర స్థానానికి దూసుకెళ్లాడు. బంగ్లాదేశ్ తో ఇటీవలే జరిగిన టీ20 సిరీస్ లో హుస్సేన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. తొలి రెండు టీ20లు విండీస్ ఓడిపోయినా అకేల్ హొసేన్ తన బౌలింగ్ తో ఆకట్టుకున్నాడు. పొదుపుగా బౌలింగ్ చేయడంతో పాటు మూడు వికెట్లు తీసుకున్నాడు. ఈ సిరీస్ కు ముందు నాలుగో స్థానంలో ఉన్న ఈ విండీస్ స్పిన్నర్ ఏకంగా మూడు స్థానాలు ఎగబాకి టాప్ ర్యాంక్ కు చేరుకున్నాడు. టాప్ ర్యాంక్ లో ఉన్న ఇంగ్లండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ రెండో స్థానానికి పడిపోయాడు. శ్రీలంక స్పిన్నర్ వానిందు హసరంగ.. ఆస్ట్రేలియా స్పిన్నర్ ఆడమ్ జంపా వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నారు. టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్ లో టాప్ 4 లో స్పిన్నర్లు ఉండడం విశేషం. బ్యాటింగ్ లో ఆస్ట్రేలియా విధ్వంసకర ఆటగాడు ట్రావిస్ హెడ్ టాప్ లో కొనసాగుతున్నాడు. పిల్ సాల్ట్, తిలక్ వర్మ, సూర్య కుమార్ యాదవ్ వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నారు.టెస్ట్ ర్యాంకింగ్స్ లో ఇంగ్లాండ్ స్టార్ ఆటగాడు రూట్ అగ్ర స్థానానికి చేరుకున్నాడు. న్యూజిలాండ్ తో జరిగిన చివరి టెస్టులో రూట్ తొలి ఇన్నింగ్స్ లో 32.. రెండో ఇన్నింగ్స్ లో 54 పరుగులు చేసి టాప్ కు చేరుకున్నాడు. మరోవైపు మూడో టెస్టులో బ్రూక్ విఫలం కావడంతో అతను రెండో ర్యాంక్ కు పడిపోయాడు. భారత ఆటగాళ్లలో జైశ్వాల్ నాలుగో ర్యాంక్.. పంత్ 9 ర్యాంక్ లో ఉన్నారు.



# హైబ్రిడ్ మోడల్‌లోనే మ్యాచ్‌లు: పాకిస్థాన్, భారత్‌కు ఐసీసీ సమన్యాయం



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, పాకిస్థాన్ క్రికెట్ జట్లకు ఐసీసీ సమన్యాయం చేసింది. ఛాంపియన్స్ ట్రోఫీ టోర్నీని హైబ్రిడ్ మోడల్ విధానంలో నిర్వహించేందుకు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) ఆమోదం తెలిపింది. దీంతో భారత్ పాకిస్థాన్ లో పర్యటించకుండా తటస్థ వేదికపై మ్యాచ్ లు ఆడుతుంది. అదే సమయంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు సైతం భారత్ లో ఐసీసీ టోర్నీ నిర్వహిస్తే రానని ఐసీసీకి చెప్పింది. పాకిస్థాన్ డిమాండ్ కు ఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2024 నుంచి 2027 మధ్యలో జరగబోయే ఐసీసీ ఈవెంట్‌లలో భారత్, పాకిస్తాన్ తమ అన్ని మ్యాచ్‌లను హైబ్రిడ్ మోడల్‌లో ఆడతాయని ఐసీసీ అధికారికరంగా ధృవీకరించింది. దీని ప్రకారం భారత్ లో జరగబోయే ఐసీసీ టోర్నీ కోసం పాకిస్థాన్ రాదు. అదేవిధంగా పాకిస్థాన్ భారత్ లో పర్యటించదు. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్థాన్ టీమిండియాకు వెళ్ళదు. 2026 టీ20 వరల్డ్ కప్ ను భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. ఈ మెగా టోర్నీకి పాకిస్థాన్ భారత్ లో పర్యటించకుండా హైబ్రిడ్ మోడల్ (తటస్థ వేదికల్లో) మ్యాచ్ లు ఆడుతుంది. మహిళలకు కూడా ఈ రూల్ వర్తిస్తుంది. 2025 మహిళల వన్డే ప్రపంచ కప్ భారత్ లో జరగనుంది. 2028లో పాకిస్థాన్ వేదికగా మహిళల టీ 20 వరల్డ్ కప్ జరగనుంది. ఈ రెండు టోర్నీలు కూడా హైబ్రిడ్ మోడల్ లోనే జరుగుతాయి. ఇటీవలే పీసీబీ, బీసీసీఐల మధ్య ఒప్పందం ప్రకారం.. ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు పాకిస్థాన్, దుబాయ్‌లో జరగనున్నాయి. భారత జట్టు ఆడే మ్యాచ్‌లు దుబాయ్ లో జరగనుండగా.. మిగిలిన మ్యాచ్‌లకు పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనుంది. భారత జట్టు నాకౌట్ పోరుకు అర్హత సాధిస్తే.. దుబాయ్‌లోనే సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు. ఒకవేళ టీమిండియా లీగ్ దశలోనే నిష్క్రమిస్తే, సెమీఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు లాహోర్, రావల్పిండిలో జరుగుతాయి.



# ముసలి హీరోలతో నటించనని చెప్పేశా'.. టాలీవుడ్ హీరోయిన్ షాకింగ్ కామెంట్స్!

చైల్డ్ ఆర్టిస్టుగా కెరీర్ ప్రారంభించి, హీరోయిన్ గా మారిన ముద్దుగుమ్మలలో కావ్య కళ్యాణ్ రామ్ ఒకరు. 'మసూద' మూవీతో లీడ్ యాక్ట్రెస్ గా పరిచయమైన ఈ తెలుగు బ్యూటీ.. 'బలగం' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. అయితే ముసలి హీరోల పక్కన యాక్ట్ చెయ్యను అని కావ్య ఓ ఇంటర్వ్యూలో చెప్పినట్లు వార్తలు వైరల్ అయ్యాయి. తాజాగా దీనిపై స్పందిస్తూ.. తన వ్యాఖ్యలను వక్రీకరించారంటూ వివరణ ఇచ్చింది.ఢకావ్య కళ్యాణ్ రామ్ లేటెస్టుగా ఓ యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో పలు ఆసక్తికరమైన విషయాలు పంచుకుంది. ఈ సందర్భంగా 'ముసలి హీరోలతో నటించను' అన్నారంట కదా? అని యాంకర్ ప్రశ్నించగా.. "నేను అలా అనలేదు. ఇదంతా ట్విస్టింగ్ టర్నింగ్ అవుతోంది" అని కావ్య సమాధానమిచ్చింది. అల్లు అర్జున్, బాలయ్య సినిమాలలో బాలనటిగా నటిస్తున్నప్పుడు, పెద్దయ్యాక తమ పక్కన హీరోయిన్ గా యాక్ట్ చేయమని సరదాగా అడిగేవారని చెప్పింది. అయితే చిన్నతనంలో ఏదో తెలియక ముసలి వాళ్ళతో యాక్ట్ చేయనని అన్నానని చెప్పింది. "చిన్నప్పుడు నేను అల్లు అర్జున్ గారు, బాలకృష్ణ గారితో సినిమాలు చేశాను. ఆ సమయంలో 'నువ్వు ఇప్పుడు చైల్డ్ ఆర్టిస్టుగా చేస్తున్నావ్. పెద్దగా అయిన తర్వాత మా పక్కన హీరోయిన్ గా చెయ్యాలి' అని నాతో జోక్ గా అన్నారు. అప్పుడు నేను చిన్న పిల్లని కదా. నాకు ఏమీ తెలియక 'నేను హీరోయిన్ అయ్యే టైముకి మీరు ముసలి వాళ్ళు అయిపోతారు. కాబట్టి నేను మీతో చెయ్యను' అని చెప్పాను. కట్ చేస్తే 20 ఏళ్ల తర్వాత అల్లు అర్జున్ గారు గ్లోబల్ ఐకాన్. ఇప్పుడు ఆయనతో వర్క్ చేయడానికి నేను చచ్చిపోతున్నాను" అని కావ్య తెలిపింది. అల్లు అర్జున్ హీరోగా పరిచయమైన 'గంగోత్రి' సినిమాలో కావ్య కల్యాణ్ రామ్ చైల్డ్ ఆర్టిస్టుగా నటించింది. "గంగోత్రి నుంచి పుష్ప వరకూ అల్లు అర్జున్ జర్నీ ఎంతో ఇన్స్పిరేషన్. సినిమా సినిమాకీ ఆయన ఇంప్రూవ్ అవుతూ ఈ స్థాయికి వచ్చారు. అంత పెద్ద ఫ్యామిలీ నుంచి వచ్చి కూడా ఎక్కడా స్తబ్దుగా ఉండలేదు. ప్రతీ సినిమాకి వేరియేషన్ చూపిస్తూ ఏదో కొత్తగా ఇవ్వాలనే తాపత్రయ పడుతుంటారు" అని కావ్య చెప్పింది. "ఇప్పుడు అందరూ పాన్ ఇండియా అంటున్నారు కానీ, నేను పూణేలో చదువుకుంటున్నప్పుడు 'బాహుబలి', 'పుష్ప' సినిమాలు రాకముందే అల్లు అర్జున్ ని అక్కడ అందరూ గుర్తు పట్టేవారు. అప్పుడే ఆయన డబ్బింగ్ సినిమాలను హిందీ, మలయాళీ జనాలు తెగ చూసేవారు" అని కావ్య తెలిపింది. 'గంగోత్రి' సినిమా టైంలో అల్లు అర్జున్ తో చాలా ఎంజాయ్ చేశానని చెప్పింది. అరకులో షూటింగ్ జరుగుతున్నప్పుడు బన్నీ, అదితి అగర్వాల్, తేజతో కలిసి చెరకు తోటలకు వెళ్ళామని తెలిపింది. గంగోత్రి సినిమాకి కూడా బన్నీ ఫుల్ డెడికేషన్ తో వర్క్ చేశారని కావ్య చెప్పింది. చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ, పవన్ కళ్యాణ్.. అంత పెద్ద స్టార్స్ అయినా సెట్స్ లో చాలా డౌన్ టు ఎర్త్ ఉండేవాళ్ళని కావ్య చెప్పుకొచ్చింది. 'స్నేహమంటే ఇదేరా' సినిమాతో బాలనటిగా పరిచయమైన కావ్య రామ్.. 'గంగోత్రి', 'ఠాగూర్', 'అడవి రాముడు', 'బాలు', 'బన్నీ', 'లేత మనసులు', 'విజయేంద్ర వర్మ', 'సుభాష్ చంద్రబోస్', 'పాండు రంగడు', 'ఉల్లాసంగా ఉత్సాహంగా' తదితర సినిమాలతో పేరు తెచ్చుకుంది. 2022లో 'మసూద'తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత 'బలగం', 'ఉస్తాద్' సినిమాలలో నటించింది.

**ప్రగతి శ్రీవాస్తవ: చుడీదార్‌లో టాలీవుడ్ స్టన్స్ యొక్క రైజింగ్ స్టార్**



**అనసూయ బ్లాక్ చీర అవతార్ పై ఇంటర్నెట్ సందడి చేస్తోంది**



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com